



ఆ గదిలో వెలుగుంది. ఒక బల్లా, రెండు కుర్చీలూ వున్నాయి. ఓ రేడియో కూడా వుంది. అది పాడుతోంది - ఏదో సినిమాలోని కామెడీ పాట. అయినా ఆ గదిలో వాళ్ళిద్దరూ మౌనంగానే వున్నారు. అతను కిటికీ దగ్గరున్న కుర్చీలో కూర్చుని వున్నాడు ఆమె దూరంగా మరో కుర్చీలో కూర్చునుంది. అతను ఒకసారి కిటికీలోంచి బయటికి చూశాడు. ఒక ముక్క నేల, ఒక ముక్క ఆకాశం - వీటి మధ్య ఎన్నో చెట్లూ-చేమలూ, మనుషులూ-జంతువులూ, చీకటి-వెలుగులూ, నక్షత్రాలూ-మేఘాలూ-ఇలా ఎన్నెన్నో కనిపిస్తున్నాయి. అతని చూపులు గదిలో ఒక మూలగావున్న "ఎక్వేరియం" వేపు తిరిగాయి. రంగు రంగుల చేపలు-ఎర్రవీ, బంగారు రంగువీ, వెండి రంగువీ-కదులుతున్నాయి. లైటు కాంతిలో అవి తళ తళా మెరుస్తున్నాయి.

అప్పటికీ అతనేమీ మాట్లాడకుండా సిగరెట్టు కాలుస్తూ కూర్చున్నాడు. ఆమె వున్నట్టుండి మెల్లిగా నవ్వింది మౌనాన్ని ఛేదించే నవ్వు కాదది. అతని కది వినిపించలేదు, కనిపించలేదు కూడా. ఇద్దరికీ విసుగు పుట్టేంతవరకూ మౌనంగా వున్న తరువాత ఆఖరికి పెదవి కదిపాడు.

"ఇదిగో చూడు. ఇహ వేచి వుండడం నా వల్ల కాదు. కొంపదీసి ఈ రోజు కూడా "నేనింకా ఏమీ నిర్ణయించుకోలే" దని అనమాకు. నీ భర్త ఎలాగా నిన్నొదిలేశాడు, కాదు నువ్వే వదిలేశావు. మా ఇంట్లో నా పెళ్ళికోసం ఒకటే తొందర పెట్టేస్తున్నారు. నువ్వు ఊఁ... అంటే చాలు."

ఆమె ఇంతకు ముందు నవ్విన నవ్వు

తాలూకు ఛాయలింకా మాసిపోకముందే, కుండ బద్దలు కొట్టినట్టున్న అతని మాటలు విని వున్నట్టుండి గంభీరంగా మారిపోయింది రేడియోలో ఇందాకటి పాట పూర్తయి ఏదో కళ్లను చల్లబరిచే కోల్డు లోషన్ గురించిన ఎడ్వర్టయిజ్‌మెంట్ వస్తోంది. అది అయిపో గానే ఇంకో పాట మొదలైంది ప్రీతిసాగర్ పాడిన "జూలీ" లోని పాట "మై హార్ట్ ఈజ్ బీటింగ్" అని—

ఆమె హఠాత్తుగా లేచి నిల్చుంది. నిల్చుని అతనితో 'ఇటు తిరగండి ప్లీజ్...' అంది

అతను తిరగలేదు. బయటికే చూస్తూ అన్నాడు.

"ఊహూఁ... తిరగను. నువ్వు నన్ను బాగా ఆడిస్తున్నావు. నేనేమీ పసిపిల్లాణ్ని కాను. ఒక సినిమానో, డాన్సు ప్రోగ్రాంనో చూసి వెళ్ళిపోయేట్టు, నిన్ను కూడా చూసి వెళ్ళిపోవడానికి నేను రాలేదిక్కడికి, నువ్విప్పుడు ఊఁ అను నీవైపు తిరుగుతాను నీ దగ్గరికి వస్తాను.'

ఆమెకు భయమేసింది. అతను మామూలుగా మాట్లాడ్డం లేదు. ఒత్తిపలికే మాటలను తేలిగ్గానూ, తేలిగ్గా పలికే మాటలను ఒత్తి పలుకుతూనూ అదో రకంగా మాట్లాడు తున్నాడు.

అతని వేపే అనుమానంగా చూస్తూ అంది ఆమె,

"తాగొచ్చారా?"

'అవును తాగొచ్చాను. మనిషినై వుండి కూడా నేను కోరినదాన్ని నీనుంచి పొందలేక పోతున్నాను. జంతువులైతే తమకి కావలసిన దాన్ని కావలసినప్పుడు పొందగలుగుతాయి'

అతను కుర్చీని కొద్ది కొద్దిగా జరుపుకుని ఒక్కసారిగా ఆమె వేపుకు తిరిగాడు. ఆమె మొహంలోకి చూశాడు బల్ల మీద ఫ్లవర్ వాజ్‌లో పెట్టిన పూలు ఇంకా తాజాగా కళకళలాడుతున్నాయి.

అతను మళ్ళీ భావోద్రేకంతో అన్నాడు,

'నువ్వతన్ని వదిలేశావు అన్న సంగతి నమ్మడానికే వీల్లేకుండా వుంది. కాకపోతే నాకు నువ్విచ్చిన మాట సంగతేమిటి? ఒక నెల రోజుల గడువు కావాలన్నావు, సరే అన్నాను ఆ నెల రోజులు దాటిపోయి ఎన్నో రోజులైపోయాయి. ఇంకా నువ్వు తటపటాయిస్తున్నావు."

ఆమె జవాబు చెప్పలేదు. లేచి నిలబడింది కాస్తా మళ్ళీ కూర్చుంది. ఆమె మొహంలో పిక్నిక్‌కి ఆనందంగా బయలుదేరుతూ మళ్ళీ ఇంటివాళ్ళందర్నీ వదలి వెళ్లడానికి మనసొప్పని కుర్రాడి తాలూకు ముగ్ధత్వం దోబూచులాడుతోంది. సందిగ్ధంలో పడిపోయి ఆమె ఏమీ తోచక కాసేపు తలవొంచుకుంది. వొంగిన ఆమె తలలోని పాపిటను చూస్తూంటే అతనికి మైకంలాంటిదేదో కమ్మినట్లయింది.

అతను ఆమెను బలవంత పెడుతున్న ధ్వనితో పిలిచాడు.

"ఇలారా!"

ఆమె రాలేదు. రేడియోలో "జూలీ" పాట పూర్తయి ఒంటి దుర్గంధాన్ని పోగొట్టి రోజంతా తాజాగా సువాసనలు వెదజల్లే సబ్బు తాలూకు ఎడ్వర్టయిజ్‌మెంటు పాటలాగ వస్తోంది అతను మళ్ళీ అన్నాడు.

"ఇలారా! అందం ఎప్పుడూ సువాసనతోనూ, శుభ్రతలోనూ మాత్రమే వుండదు. అందమనేది సహజంగా రావాలి. అది నీలో వుంది."

అప్పటికీ ఆమె రాలేదు. రేడియోలో మరో పాట మొదలైంది - తాగి మత్తుగా

పాడుతున్న పాట ఏ ... లాల్ రంగ్ కబ్ ముజే ఛోడేగా ...

అతను లేచి నిల్చున్నాడు. ఆమె కుర్చీకి తన కుర్చీకి మధ్యనున్న ఖాళీ స్థలంలో గడియారంలోని పెండులంలా అటూ ఇటూ తిరగనారంభించాడు. సమయం గడిచి పోతోంది. చీకటి చిక్కపడి రాత్రి దట్టంగా అలుముకుంటోంది బయట వీధిలో ఎవరో ఎవరినో 'ఓయ్ ... కాస్త ఆగవోయ్... నేనూ వస్తున్నా...' అనడం, దానికి జవాబుగా 'త్వరగా రావోయ్...' అనడమూ వినిపించింది. అతనింకా పెండులంలా తిరుగుతూనే వున్నాడు. అతనటువేపు వెళ్ళినప్పుడల్లా ఈసారి తప్పక కుర్చీలో కూర్చుండిపోతాడనీ. ఇటువేపు వచ్చినప్పుడల్లా తన మీదికే వచ్చేస్తాడేమోననీ అనిపిస్తోంది ఆమెకు. కాని అతను విసుగూ, విరామం లేకుండా అలాగే అటూ ఇటూ తిరుగుతూనే వున్నాడు. పైకప్పునుంచి వేలాడుతున్న లైటు ఎందుకో ఒకసారి ఆరిపోయి అంతలోనే మళ్ళీ వెలిగింది. చివరికి మౌనం భరించలేక ఆమె అంది.

"కూర్చోండి... మీరు నాకు దగ్గరగా వచ్చినప్పుడల్లా నా మీదే పడిపోతారేమోనని భయంగా వుంది."

అతను అలా నడుస్తూనే అన్నాడు.

"నీకు నా మీద ప్రేమ ఒక్కటి తప్ప మిగిలినవన్నీ వున్నట్టున్నాయి. జాలీ, సానుభూతీ, మమత, మమకారం వగైరా వగైరాలన్నీ... ఇవన్నీ లేకపోయి నా ప్రేమ

(మిగతా 29వ పేజీలో)


## అపూర్వమయిన అవకాశం

### ట్రాన్సిస్టర్ల అమ్మకానికి ఉద్దేశించిన పథకం

నమూనా మొత్తం 50

| | | | |
|---|---|---|---|
| 11 | 16 | 9 | 14 |
| 20 | 5 | 18 | 7 |
| 13 | 12 | 15 | 10 |
| 6 | 17 | 8 | 19 |

మొదటి బహుమతి : వెయ్యి రూపాయల నగదు అన్ని అంకెలు సరిగా ఉండాలి. రెండవ బహుమతి : 500 రూపాయల నగదు, పై మూడు వరుస అంకెలు సరిగా ఉండాలి. మూడవ బహుమతి : (200 లేదా పాల్గొనే వారందరికీ) 270 రూపాయల విలువయిన మూడు బ్యాండ్ల సోని ట్రాన్సిస్టరు ఏ అంకె సరిగా ఉన్నా ఇవ్వబడుతుంది. క్రింది నిబంధనలు జాగ్రత్తగా గమనించ ప్రార్థన. 1. 6 నుండి 21 వరకు గల సంఖ్యలను మాత్రమే వాడాలి. ఏ వైపు నుండి కూడినా మొత్తం 54 రావాలి. 2. సీలు వేసిన సొల్యూషన్ మా కార్యాలయంలో ఉన్నది ఎం. డి. సమక్షంలో తె వబడుతుంది. 3. ఎంట్రీ ఫీజు లేదు. మా కార్యాలయంలోని సొల్యూషన్‌తో సరిగా ఉన్న ఎంట్రీలకే మొదటి రెండు బహుమతులు ఇవ్వడం జరుగుతుంది. 4. తృతీయ బహుమతి గెలుపొందిన వారు తపాల ఖర్చులు భరించాల్సి ఉంటుంది. 5. మూడవ బహుమతి గెలుపొందిన వారికి నగదు బహుమతి ఇవ్వబడదు. 6. ఫలితాల కోసం 45 పైసల పోస్టేజి పంపాల్సి ఉంటుంది. 7. ఒక పోటీదారుడు ఒక్క ఎంట్రీ మాత్రమే పంపాలి. 8. ఎటువంటి వ్యాజ్యమయినా ఆలీగడ్ సివిల్ కోర్టులో పరిష్కరించుకోవాల్సి ఉంటుంది.

ముగింపు తేదీ ; 24-4-77 ఫలితాలు ; 26-4-77

**Mayur Traders (PTR-58) ALIGARH-30**

(23 వ పేజీ తరువాయి)

ఒకటీ వుంటే బావుణ్ను. అయినా ప్రేమతో కొడితే దెబ్బ తాలూకు నొప్పి కూడా మధురంగా వుంటుందికదూ?

వాళ్ళిద్దరూ సహజంగా వుండాలని ఏదో రియలిస్టిక్ సినిమాలో పాత్రధారుల్లాగా మాట్లాడుకుంటున్నారు, కాదు ప్రవర్తిస్తున్నారు, నిట్టూర్పులు విడుస్తున్నారు. ఆమెకు నవ్వాలనిపించింది. నవ్వింది. అతని మొహంలో కోపం పొడ చూపింది. కింది పెదవిని పంటితో నొక్కిపట్టుకున్నాడు. అతని తెల్లటి పళ్ళు నాలుగైదు కనిపించాయి. అతని నడక వేగం ఇప్పుడు ఎక్కువైంది. అది కాస్సేపే. తరువాత మళ్ళీ వేగం తగ్గి నడక మామూలు స్థాయికి వచ్చింది. అతను తన కుర్చీని మళ్ళీ కిటికీవేపుకు లాక్కుని బయటికి చూస్తూ కూర్చున్నాడు. మసక వెలుతురులో చెట్లూ - చేమలన్నీ నిద్రతో జోగుతున్నట్టు కనిపిస్తున్నాయి

రేడియోలో ఏ...లాల్ రంగ్ ... పాట పూర్తికాగానే ఆమె లేచి వెళ్ళి స్టేషన్ మార్చింది. అక్కడ తాళవాద్యకచ్చేరీ కాబోలు వినిపిస్తోంది. మృదంగం మీద గట్టిగా వాయిస్తున్న ఆ ధ్వనితో ఉత్తేజితుడై "అతను అబ్బ! మృదంగ ధ్వని వింటూంటే బద్ధకమంతా వొదిలిపోయి నవ చైతన్యం కలుగుతున్నట్టనిపిస్తోంది" అన్నాడు.

ఆమె మొహం గంభీరమైంది-

మళ్ళీ లేచి వెళ్ళి స్టేషన్ మార్చింది. అక్కడ రాగాలాపన కాబోలు వస్తుంది. ఆమెకు ఆ రాగాలాపనలో ఆవేదనాభరిత మైన ఆనందం ఏదో వున్నట్టనిపిస్తుంది. ఆ రాగాలాపన అంతకంతకూ విస్తరించి పరిసరాలన్నింతా ఆవరించేస్తుంది. మత్తుగా వున్న అతని కళ్ళు తీవ్రమైన ఆకలితో మెరుస్తున్నాయి గబుక్కున అన్నాడతను.

"ఎందుకనో నాకిరోజు చాలా చికాగ్గా వుంది. అందుకే బార్ కెళ్ళి తాగొచ్చాను. ఈ రోజు ఏమైనాసరే. ఏదో ఒకటి తేలిపోవాలి నాలో ఇహ ఏమాత్రం ఓపిక లేదు. ఓర్మి, సహనం అన్నిటినీ కోల్పోయాను. నువ్వు కాదంటే నేను తిరిగెళ్ళిపోతాను. వెళ్ళిపోయేముందు నాకూ, నీకూ ఎప్పటికీ జ్ఞాపకం వుండేలా ఒక పని చేసి మరీ పోతాను నువ్వెంత చెప్పినా సరే, నేను మాత్రం నిన్ను వదలను..."

ఆమె రెండు చేతుల్తోనూ మోహం కప్పుకునిఏడవడం మొదలెట్టింది. ఏడుస్తూనే అంది.

"మాఊరినుంచిపారిపోయివచ్చి ఈ ఊళ్లో స్వతంత్ర జీవితం ప్రారంభించిన తరువాత గాని నాకు తెలిసి రాలేదు, నేనేం తప్పు చేశానో? మొగుడొదిలేసిన ఆడది అని నామీద మీరంతా శ్రద్ధ చూపడం మొదలెట్టారు ఆఫీసులో పనిచేస్తున్నప్పుడు కూడా ఎన్నో జతలకళ్ళు నామీదే వుంటాయి. అందుకనే కాస్త రక్షణ కోసం నేను మిమ్మల్ని ఎన్నుకున్నాను. కాని మీరుకూడా అలాంటివారేనని నేనూహించలేదు. మావారికి, మీకూ చాలా విషయాల్లో పోలికలున్నట్టున్నాయి. మావారు తాగుబోతు. రోజు తాగొచ్చి నన్ను నానా హింసలూ పెడ్తారనే నేనతన్ని వదిలేసి వచ్చింది. చూస్తే ఈరోజుమీరూ తాగొచ్చారు. పైగా ఏదోచేస్తానని మంకుపట్టు పట్టుతున్నారు అది కూడా ఆయనలాగే..."

అతను రెండడుగులు ముందుకు వేసి మళ్ళీ ఆగి పోయాడు.

ఆమె ఇంకా ఏడుస్తూనే చెబుతూవుంది.

ఆయన తాగొచ్చేవారు. తాగొచ్చి ప్రేమ పేరుతో నాఒళ్ళంతా హూనం చేసేవారు.

ఎముకలన్నీ విరిగి పోయేలా నలిపేస్తూ నన్ను చిత్ర హింసలు పెట్టి తాను ఆనందించేవాడు. కాస్త ఎదురు తిరిగితే గొడ్డును బాదినట్టు బాది తన కోరిక తీర్చుకునేవారు. కిక్కురు మన కుండా ఆ బాధలన్నీ భరించాను. కానీ రాను రాను ఆ హింసలూ, బాధలూ, భరించే శక్తి నాలో నశించి పోయింది. అందుకే ఇంట్లోంచి పారిపోయి వచ్చేశాను. నేడు దాన్నే మీరు నాకివ్వడానికి సిద్ధమవుతున్నారు. అది నా కొద్దు...

ఆమె చెప్పడం ఆపింది. రేడియోలో రాగాలాపన ఆగిపోయి వొట్టి మృదంగ వాద్యమే వినవస్తోంది ఇద్దరూ కాస్సేపు తమ ఆలోచనలన్నీ మరిచిపోయి ఆ వాద్యధ్వని ఆలకించడంలో లీనమైపోయారు. అంతలో వాద్యధ్వని ఆగిపోయి ఆంగ్లంలో వార్తలు ప్రారంభమయ్యాయి, "దిసీస్ ఆలిండియా రేడియో. ది న్యూస్ రెడ్ బై సుర్‌జిత్ సేన్ అని వినిపించింది. వాళ్ళు మటుకు ఆవార్తల్ని వింటున్నట్టు లేదు. ఎవరి కుర్చీలో వాళ్ళు కూర్చుని ఎవరి ఆలోచనల్లో వారున్నారు.

రేడియోలో వార్తలు ముగిసి వయోలిన్ వాద్యం వినవస్తోంది. అందులోని రాగం మాత్రం విషాదభరితంగా వుంది. గుండెలను పిండేసేలా వుంది. విషాదమే ముద్ద కట్టుకుని గాలిలో తేలివచ్చినట్టు అనిపించి అతనిగొంతు మరింత మృదువుగా మారిపోయింది.

"చూశావా మనసులోని విషాదాన్ని ఎలా రాగాలుగా పలికించవచ్చో ? మరీ మంద్ర స్థాయిలో వయోలిన్ వినిపించినప్పుడల్లా నాకు మనిషి కొనఊపిరితో వున్నప్పుడు శ్వాసను సులభంగా పీల్చుకోలేక విడవనూ లేక అవస్థపడుతున్నట్టనిపించి ఏడుపొచ్చే స్తుంది. నిన్నటి దినం చీకటిలో మా సందు చివర నడిచి వస్తూంటే కాలికి తడిగావున్న వస్తువేదో తగిలింది. తీరా పరిశీలించి చూస్తే అది కుక్కపిల్ల, చచ్చిపోయివుంది. అక్క డక్కడా రక్తం పేరుకుని వుంది. ఏబస్సు కిందనో లేక లారీకిందనో పడి చచ్చిపోయి వుండవచ్చు. నామనసంతా ఎలాగో అయి పోయింది. మరో ప్రాణి చావు మన బతుకుని గురించి ఆలోచింపచేస్తుంది ... నా అతివాగుడు తనాన్ని క్షమించు"

ఇంత చెప్పిన తర్వాత ఇహ మాట్లాడ్డం తనవల్ల కాదేమో ననిపించిం దతనికి. నెమ్మ దిగా ఆమెవేపుకు అడుగు వేశాడు. ఆమె కుర్చీలోనే ముడుచుకు పోయింది. అతను ఆమె దగ్గరకొచ్చి కుర్చీవెనకనిలబడి ఆమె తలని వెనక్కి వొంచి ఆమె కళ్ళల్లో కళ్ళు పెట్టి చూశాడు. ఆమె మొహాన్ని రెండు చేతులతో పట్టుకుని చిన్నగా నవ్వాడు. నవ్వి "ముద్దుపెట్టుకోనా...?" అన్నాడు.

ఆమె పెదవులు వణికాయి. అతను వొంగి ఆమెను ముద్దు పెట్టుకున్నాడు. తరువాత తన్మయంగా అంటున్నట్టు అన్నాడు

లోకం కళ్ళకు ఇలాంటి ప్రేమకనిపించదు ఇలాంటి అనుబంధం అర్థంకాదు స్త్రీ- పురుషుల సంబంధాలన్నిటినీ పెళ్ళి వ్యభిచారం అనే రెండే మాటల కింద వర్ణి స్తుంది ఈలోకం. ఇది ఒక ఆడ మగకు సంబంధించిన ప్రేమకథ. కలలు నిద్రలోనే పుట్టుకొచ్చి నిద్రలోనే అంతమైనట్టు ఇలాంటి ప్రేమ రహస్యంగా పుట్టి రహస్యంగా జీవించి చివరికి రహస్యంగానే చచ్చి పోతుంది.

రేడియోలోంచి ఇంకా వినవస్తున్న విషాద సంగీతానికి తన్మయులైపోయి ఇద్దరూ ఒకరినొకరు హత్తుకుపోయారు. ఆమె అతని బాహువుల్లో కరిగిపోయింది.

వయోలిన్ సంగీతం మంద్రగతిలో ఇంకా వినవస్తూనే వుంది, చీకటిలోంచి వెలుతురు కారిపోతున్నట్టు. *